నమస్తే తెలంగాణ
మెదక్

I | హైదరాబాద్, ఆదివారం 9 మార్చి 2025 | MEDAK



అక్కన్నపేట మండలంలోని చౌడుతండాలో ట్యాంకర్ నీళ్లు పట్టుకునేందుకు గిరిజనులు తమ ఇండ్ల ముందు పెట్టుకున్న బకెట్లు, డ్రమ్ములు

గొంతెండుతున్న గిరిజనం

- జీపీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా
- గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న గ్రామీణులు

తండాల్లో తాగునీటికి కటకట.. మిషన భగీరథ నీళ్లు బంద్

అక్కన్నపేట మండలంలోని బోదర్‌వాగు తండాలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

అక్కన్నపేట మండలంలోని మంజ్యానాయక్ తండాలో నీళ్లు పట్టుకుంటున్న గిరిజనులు

అక్కన్నపేట, మార్చి 8: వేసవి ప్రారంభంలోనే సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల వ్యాప్తంగా తాగునీటికి కటకట మొదలైంది. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీళ్లు బంద్ అయ్యాయి. గుక్కెడు తాగునీటి కోసం తండాలు తల్లాడిల్లిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం పశువుల కాపరులు బావుల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. తండాల్లో ఫంక్షన్లు అయితే రూ.500 నుంచి రూ.1000 చెల్లించి నీళ్ల ట్యాంకర్‌ను కొనుకుంటున్నారు. జనవరి నుంచి మిషన్ భగీరథలో ప్రధానమైన ఇంట్రా, గ్రిడ్ వ్యవస్థల మధ్య నీటి సరఫరాలో సమన్వయం లేకపోవడం, క్షేత్రస్థాయిలో నిర్వహణ లోపం, అధికారుల పర్యవేక్షణ కరువై తండాలకు నీళ్లు రాకుండా అయ్యాయి. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తూతూమంత్రంగా రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా అవుతుంది. మండలంలో సుమారు 100 గిరిజన తండాల వరకు ఉండగా, దాదాపు అన్ని తండాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటి, వచ్చీపోయే కరెంటుతో ఆరుగాలం కష్టం చేసిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే.. మరోవైపు తాగేందుకు కూడా నీళ్లు దొరకని దౌర్భాగ్య పరిస్థితులు కాంగ్రెస్ సర్కారులో దాపురించాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కెప్టెన్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చౌడు తండా, బోదర్ వాగు తండా, మంజ్యానాయక్ తండాలకు దాదాపు మూడు నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. మూడు తండాల పరిధిలో సుమారు 400 వరకు గిరిజనులు ఉన్నారు. సుమారు వంద వరకు ఇండ్లు ఉన్నాయి. తండాలకు నీటి సరఫరా రాకపోవడంతో గిరిజన మహిళలు సమీపంలోని వ్యవసాయ బావుల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. ట్యాంకర్ ద్వారా వచ్చే నీళ్లను నిల్వ చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పదేండ్ల కిందట కరువు మళ్లీ వచ్చిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీళ్ల సమస్య పరిష్కరించాలని ఆందోళన

మండలంలోని బోదర్‌వాగు తండాకు చెందిన పలువురు గిరిజనులు గురువారం తాగునీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని, నీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ... మూడు నెలల నుంచి తండాకు నీళ్లు రావడం లేదన్నారు. గతంలో మిషన్ భగీరథ నీళ్లు వచ్చాయనీ, సంక్రాంతి తర్వాత నుంచి నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎవుసం బావుల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటూ వంట చేసుకుంటున్నామన్నారు. నీళ్లు రావడం లేదని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్ల సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావును వివరణ కోరగా కొద్ది రోజుల నుంచి ఇంట్రా, గ్రిడ్‌ల మధ్య సమన్వయం లోపంతో పలు సమస్యల కారణంగా తండాలకు నీళ్లు వెల్లడం లేదు. దీంతో జీపీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

మిషన్ భగీరథ నీళ్లు రాక మూడు నెలలు

తండాలకు మిషన్‌భగీరథ నీళ్లు రాక దాదాపు మూడు నెలల అవుతుంది. నీళ్ల కోసం అరిగోస పడుతున్నాం. ట్యాంకర్ వచ్చిందంటే నీళ్ళు పట్టుకునే కాడ లొల్లులు అవుతున్నాయి. ఇన్నాళ్లు ఉదయం, సాయంత్రం తండాల్లోని ప్రతి ఇంటి ఎదుట నల్లా ద్వారా మిషన్ భగీరథ నీళ్లు వచ్చేవి. చాలా సంతోషంగా ఉండేది. కానీ, ఇప్పుడు మళ్ల ఎనుకటి రోజులు వచ్చాయి. బిందెలు పట్టుకొని పొలాల ఒర్రం మీద నుంచి నడుచుకుంటూ నీళ్లుతె చ్చుకొనే రోజులు వచ్చాయి.

–భూక్య స్వరూప, బోదర్‌వాగు తండా (సిద్దిపేట జిల్లా)

కాంగ్రెసోళ్లు వచ్చిండ్రు..మళ్ల కరువు వచ్చింది..

కాంగ్రెసోళ్లు వచ్చిండ్రు... మళ్ల కరువు వచ్చింది. తాగడానికి నీళ్లు కూడా దొరుకుత లేవు. ఎనుకట కూడా కాంగ్రెసోళ్లప్పుడు గిట్లానే ఏండ్లకు, ఏండ్లు కరువు వచ్చింది. తండాలో కేసీఆర్ సారూ అప్పుడు ట్యాంకు కట్టించిండ్రు. పోయినా ఏడాది వరకు నీళ్ల పుష్కలంగా ఉండేది. ఇప్పుడు ట్యాంకు ఎండిపోయింది. మిషన్ భగీరథ నీళ్లు కూడా రావడం లేదు. ట్యాంకర్ ద్వారా నీళ్లు వచ్చినప్పుడు పట్టుకొని రెండు, మూడు రోజుల దాకా పొదుపు చేసుకొని పరిస్థితి వచ్చింది. నీళ్లు లేవని చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారు. – బుజ్జి, మంజ్యానాయక్ తండా (సిద్దిపేట జిల్లా)

రామాయంపేటలో ఎండిపోయిన ఒకే రైతుకు చెందిన రెండున్నర ఎకరాల వరిపొలం

రైతుల గురించి పట్టింపే లేదు...

రైతుల గురించి ప్రభుత్వానికి పట్టింపే లేదు. భూగర్భజలాలు అడగంటడం ఒక సమస్య అయితే, ప్రత్యామ్నాయ మార్గాలు చూడకపోవడం మరో సమస్య. మా గ్రామ శివారు నుంచి కెనాల్ వెళ్లింది. దానిని కనీసం గ్రామంలో ఉన్న చెరువు, కుంటలకు మళ్లిస్తే బాగుండు. కానీ, పాలకులు, అధికారులు ఆలోచన చేయడం లేదు. ఇప్పటికైనా భవిష్యత్‌లో ఇలాంటి సమస్య రాకుండా చూడాలి.

– రాములు, బాలయ్య, రైతులు, సుతారిపల్లి, రామాయంపేట మండలం

ఎన్నడూ ఎండని బోరు ఎండుతోంది...

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి బోరు పోయడం తగ్గలేదు. ఈసారి మాత్రం ఒక్కసారిగా నీరుపోయడం తగ్గింది. నేను నాలుగెకరాల్లో వరి వేశాను. ఇప్పుడు అది చేతికి వస్తుందో రాదో తెలియదు. చుట్టు పక్క గ్రామాలకు కాల్వల ద్వారా నీరందుతుంది. మాకు కూడా ఒక మార్గం ద్వారా కాళేశ్వరం కాలువ వచ్చింది. మిగతా మార్గాలకు వచ్చే క్రమంలో ప్రభుత్వం మారింది. –శ్రీకాంత్‌రెడ్డి, ప్రగతి ధర్మారం, రామాయంపేట మండలం

కాంగ్రెస్ అంటేనే కష్టాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు వచ్చినా ఏదో ఒక కష్టాన్ని తీసుకువస్తుంది. కేసీఆర్ వచ్చిన తర్వాత వ్యవసాయం ఎంతో మంచిగా చేసినం. సాగునీరు, కరెంటు కష్టాలు పూర్తిగా పోయినయ్. రాత్రి పూట పొలాల వద్దకు పోయే పరిస్థితి ఎప్పుడు రాలేదు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి వచ్చింది. భూగర్భ జలాలు అడుగంటడం, కరెంటు కోతల వల్ల పొలాల వద్దే ఉంటున్నాం. రైతుల దేవుడు కేసీఆర్, ఆయన వస్తేనే మా బతుకులు మారుతాయి. – నర్సయ్య, రైతు, శివాయిపల్లి, రామాయంపేట మండలం

బారానవంతు పొలం ఎండిపోయింది..

మొదట్లో బోరు నుంచి సంపృద్ధిగా నీళ్తు వస్తుండే. కానీ, ఇప్పుడు బోరు నుంచి సరిగ్గా నీళ్లు వస్తలేవు. మా ఊరి వరకు కాలువలు నిర్మించినా బాగుండు. రెండు ఎకరాల వరకు వరి పొలం నాటినా. ఇప్పుడు బారానవంతు ఎండిపోయి, చారానవంతు పొలం తడులతో పారుతున్నది. ఎండిపోయిన పొలానికి ప్రభుత్వం ఏమైన నష్ట పరిహారం చెల్లించాలి. లేకపోలే రైతులకు అప్పులే విగులుతయ్.

– చంద్రయ్య రైతు, నందగోకుల్, నిజాంపేట మండలం

ఉమెన్స్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే



నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న హరీశ్‌రావు

నర్సాపూర్, మార్చి 8: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

సునీతాలక్ష్మారెడ్డికి సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించారు. సాయంత్రం నర్సాపూర్ చేరుకున్న హరీశ్‌రావు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో-ఆప్షన్ మాజీ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మహిళలు అన్నింటా రాణించాలి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 8: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని, అప్పుడే అనుకున్న రంగంలో రాణిస్తారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల పాత్ర కీలకం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, సమైక్య పాలనలో తాగడానికి తాగునీరు దొరకని పరిస్థితి ఉండేదన్నారు. కేసీఆర్ ఇంటింటికీ తాగునీరు అందించి ఆడబిడ్డల కష్టాలు తీర్చినట్లు తెలిపారు. మేనమామ కానుకగా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకున్నారని గుర్తుచేశారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు న్యూట్రిషన్ కిట్ పథకాన్ని అమలు చేశారన్నారు. బీడీ కార్మికులకు జీవనభృతి అందించారన్నారు. మహిళల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణాశ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపాలి



ఆకునూరులో ఎండిపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న నిమ్మ నిఖిల్‌రెడ్డి, నాయకులు

చేర్యాల, మార్చి 8: రాష్ట్రంలో సాగునీటి సమస్యను శాశ్వతంగా దూరం చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని మాజీ మంత్రి నిమ్మ రాజారెడ్డి మనుమడు, యువజన నాయకుడు నిమ్మ నిఖిల్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో ఎండిన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి వెంటనే నీటిని చేర్యాల ప్రాంతంలోని చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతుంటే రైతులు పశువులను మేపుతున్నారని తెలిపారు. పంటలు ఎండుతుండడం కాంగ్రెస్ నాయకులకు, ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఇలాంటి కష్టాలు రాలేదన్నారు. వెంటనే గోదావరి జలాలు విడుదల చేసి రైతులను అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కల్యాణం.. కమనీయం

- వెలిమెలలోని అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, మార్చి 8: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలోని శ్రీఅనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి సమయంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. 16,17 వార్డుల గ్రామ తాజామాజీ కౌన్సిలర్లు ఒగ్గు సుచరితకొమురయ్య దంపతులు, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు రాజకీయ ప్రముఖులతో పాటు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి, రాములుగౌడ్, అంజయ్య, బుచ్చిరెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి మాజీ మంత్రి హరీశ్‌రావుకి హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి స్వామివారి ఫొటోను అందజేశారు. హరీశ్‌రావుకి వెలిమెలలో బీఆర్ఎస్ శ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

డంపింగ్‌యార్డుతో నర్సాపూర్‌కు ముప్పు

నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న 8వ వార్డు ప్రజలు, నాయకులు

నర్సాపూర్, మార్చి 8: ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపుయార్డు ఏర్పాటుతో నర్సాపూర్ పట్టణానికి ఎక్కువగా ముప్పు పొంచి ఉందని మాజీ కౌన్సిలర్ రామచందర్ అన్నారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 18వ రోజుకు చేరుకుంది. శనివారం దీక్షలో భాగంగా 8వ వార్డుకు చెందిన అఖిలపక్ష నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, యూత్ సభ్యులు వంటావార్పు చేపట్టి బాటసారులకు, పేదలకు భోజనం వడ్డించారు. అనంతరం నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రామచందర్ మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో నర్సాపూర్‌కు ఎక్కువగా ప్రమాదం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆందోళనలో అఖిలపక్ష నాయకులు రమణారావు, చౌటి జగదీశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ముదిరాజ్ సంఘ సభ్యులు, ముత్యాలమ్మ యూత్ సభ్యులు, డ్రాగన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, టీటీడీ బాయ్స్ యూత్ సభ్యులు, రెబల్ బాయ్స్ యూత్ సభ్యులు, అంబేద్కర్ యూత్ సభ్యులు, జగ్‌జీవన్‌రావు సంఘ సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని మళ్లిస్తే ఊరుకోం

- తాత్కాలిక జీవోతో రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు
- సాగునీళ్ల కోసం రెండు మండలాల రైతుల వాగ్వాదం

నంగునూరు, మార్చి 8: సాగునీటి కోసం సిద్దిపేట జిల్లా నంగునూరు, ధూళిమిట్ట మండలాల రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రంగనాయకసాగర్ కుడి కాలువ నుంచి కోనాయపల్లి, తిమ్మాయిపల్లి, దానంపల్లి, నాగరాజుపల్లి గ్రామాల ద్వారా నంగునూరు వాగులోని చెక్‌డ్యామ్ నింపేందుకు కాలువ తీశారు. దానంపల్లి, కమలాయపల్లి మధ్యలో నుంచి నీటిని తరలించేందుకు ఎల్‌డీ-10 కాలువ నుంచి నీటిని మళ్లించేలా తాత్కాలిక జీవో తీసుకువచ్చి కాలువకు గండి కొట్టారు. దీంతో శనివారం నంగునూరు మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నంగునూరు మండలానికి చెందిన 11 గ్రామాల రైతులు అక్కడికి చేరుకొని కాల్వ గండి కొట్టడాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఇరు మండలాల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాత్కాలిక జీవోలో యాసంగి పంటకు మాత్రమే సాగునీరు తీసుకెళ్లాలని ఉండడంతో కేవలం కమలాయపల్లి గ్రామానికి మాత్రమే సాగునీరు మళ్లించాలని, అర్జున్ పట్ల, ధూళిమిట్ట, లింగాపూర్, జాలపల్లి గ్రామాలకు ఈ కాలువ ద్వారా సాగునీటిని మళ్లించవద్దని రైతులు తేల్చి చెప్పారు. కుడి కాలువకు కొట్టిన గండిని మూసివేసి డిస్ట్రిబ్యూషన్ కాలువ ద్వారా చిన్న పైపు వేసుకొని మాత్రమే కమలాయపల్లి వరకు నీటిని మళ్లిస్తే తమకు అభ్యంతరం లేదని రైతులు తెలిపారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

గండికొడితే ఊరుకోం: బీఆర్ఎస్ నాయకులు, రైతులు

అనంతరం నంగునూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన రంగనాయకసాగర్ కాలువ ద్వారా నంగునూరు మండలంలోని 11 గ్రామాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఎల్‌డీ-10 కాలువను నిర్మించారన్నారు. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల కమలాయపల్లి గ్రామానికి వచ్చి ఎల్‌డీ-10 నుంచి అక్రమంగా గండి కొట్టే ప్రయత్నంలో భాగంగా తాత్కాలిక జీవో జారీ చేశారని ఆరోపించారు. ఈ జీవో ద్వారా నంగునూరు మండల రైతుల నోట్లో మట్టి కొట్టే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతుల మధ్య వైషమ్యాలు పెంచి యుద్ధ వాతావరణం నెలకొల్పే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదన్నారు. కమలాయపల్లి గ్రామానికి మాత్రమే సాగునీరు ఇవ్వాలని, మిగతా గ్రామాలకు నీటిని మళ్లిస్తే ఊరుకోమని హెచ్చరించారు. అధికారం చేతిలో ఉందని తాత్కాలిక జీవోను శాశ్వత జీవోగా మార్చితే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నంగునూరు మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేష్‌గౌడ్, మాజీ రైతుబంధు సమితి మండల కన్వీనర్ కిష్టారెడ్డి, నాయకులు వేణు చక్రవర్తి, సిద్దు, రాము, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గండి కొట్టడాన్ని అడ్డుకుంటున్న రైతులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

మా ఆందోళనలు పట్టవా

డంప్‌యార్డు ఏర్పాటుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆందోళనకారులు

గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు, మహిళలు

నల్లవల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

గుమ్మడిదల, మార్చి 8: ప్యారానగర్ డంపింగ్‌యార్డు రద్దు చేయాలని 32రోజులుగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వానికి చెవులు వినిపిస్తలేవా.. కండ్లు కనిపిస్తలేవా..? మా బాధలు పట్టవా అని రైతు మహిళా సంఘాల సభ్యులు ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులు ఆపాలని డిమాండ్ చేస్తూ గుమ్మడిదల బల్దియాలో, నల్లవల్లి, కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శనివారానికి దీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రిలే నిరాహార దీక్షలో రైతు, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రైతు జేఏసీ అధ్యక్షురాలు ఇందుల మల్లమ్మ, రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు.

బతుకులు ఆగమైతయి..

డంపింగ్‌యార్డు ఏర్పాటుతో మా బతుకులు నాశనమవుతాయి. కాలుష్యం బారినపడతాం. ఎవుసం కుంటుపడే ప్రమాదం ఉంది. ఎవుసాన్నే నమ్ముకున్న మాకు ఉపాధి కోల్పోయి వలసపోవాల్సి వస్తుంది. పర్యావరణాన్ని, మా పిల్లల భవిష్యత్ కాపాడుకోవడానికి డంప్‌యార్డు ఇక్కడ్నుంచి తరలించాలి. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– పద్మ, గుమ్మడిదల రైతు జేఏసీ మహిళా సభ్యురాలు

సర్కారు పునరాలోచించాలి

డంపింగ్‌యార్డు ఏర్పాటుతో అన్ని విధాలా మా ప్రాంతానికి నష్టం జరుగుతుంది. డంపింగ్‌యార్డు వద్ద 13 గ్రామపంచాయతీల ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేసినం. అయినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వం డంపుయార్డు పనులు వెంటనే ఆపాలి.

– రేణుకారెడ్డి, రైతు జేఏసీ సభ్యురాలు, గుమ్మడిదల

ఎవుసం దెబ్బ తింటది..

గుమ్మడిదల, చుట్టు పక్కల గ్రామాలతో పాటు వెల్దుర్తి, శివంపేట, నర్సాపూర్ వంటి మండలాల భూగర్భ జలాలు కలుషితమై ఎవుసం కుంటుపడే ప్రమాదం ఉంది. డంపింగ్‌యార్డు ఏర్పాటైతే ఎవుసం చేయలేము. దీనివల్ల ఎవుసం పనులు దొరకవు. ప్రభుత్వం మా పొట్టకొట్టే పని చేయవద్దని కోరుతున్నాం. – ఇందుల మల్లమ్మ, రైతు జేఏసీ అధ్యక్షురాలు, గుమ్మడిదల

వేడుకలకు మేము రాం..

మహిళా దినోత్సవ వేడుకలను బహిష్కరించిన గుమ్మడిదల మహిళలు

గుమ్మడిదలలో ఐకేపీ ఏపీఎంకు దండం పెట్టి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలుపుతున్న మహిళలు

గుమ్మడిదల, మార్చి 8: రాష్ట్ర ప్రభుత్వం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల మహిళలు బహిష్కరించారు. హైదరాబాద్ జరిగే వేడుకలకు హాజరు కావడానికి ఐకేపీ అధికారులు ప్రతి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేశారు. నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ డంపుయార్డు రద్దు చేయాలని 32 రోజులుగా రైతు, మహిళా జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల జేఏసీ నాయకులతో పాటు మండలంలోని 13 గ్రామాల మహిళా సంఘాల సభ్యులు కార్యక్రమాన్ని బహిష్కరించారు. మండలం నుంచి ఏడు బస్సుల్లో 350 మంది మహిళలను తరలించడానికి ఐకేపీ యత్నించగా, మహిళా జేఏసీ నాయకులు బహిష్కరించి కార్యక్రమానికి వెళ్లలేదు.